# శ్రీసన్నిధానం

సంపుటి 1 సంచిక 9
జూలై 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం -
4. హరి శయనం ఆషాఢమాస విశేషం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
   బాల సూర్యుని భావ స్ఫూర్తి
7. అగణ్య పుణ్య వారాశి-ఆది ఏకాదశి
   -గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు
10. శ్రీభాష్యం వారి శ్రీనిధి
   - ప్రవచనాల పెన్నిధి
11. బాలవిజ్ఞానం -
   ఉపాసనా శక్తి
12. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్


సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు

## ముఖచిత్ర పరిచయం

ముఖచిత్రం వరుసగా వస్తున్న పండుగలకు అద్దంపడుతోంది. పడుగలకు ఆది తొలి ఏకాదశిని చెప్పుకుంటాము. శ్రీమన్నారాయణుడు శేషసాయిపై పవళించినా ముల్లోకాలలోని భక్తులు శ్రీవారి చల్లని చూపులో ఉంటారని తెలిపేదే తొలి ఏకాదశి. ఇక తెలంగాణలో నిర్వహిస్తున్న బోనాల వేడుకలు సంప్రదాయపు వెలుగులు విరజిమ్ముతోంది.

గురువు అంటే వ్యాసులవారే. వారు ఆవిర్భవించినది ఈ మాసంలోనే వ్యాసపూర్ణిమను గురుపూర్ణిమగా వ్యవహరిస్తూ గురువులందరినీ సత్కరించుకునే అవకాశం కలిగేది ఇప్పుడే. ఆషాఢం ఆడపడుచుల మాసం, కొత్త అల్లుళ్ళకు ఆటపట్టీ మాసం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఆయా ప్రాంతాల ఆచారాలకు అణుగుణంగా పడుగలు జరుపుకుంటారు.

చాతుర్మాస దీక్షలు, పితృదేవతల ప్రీతిపాత్రమైన దక్షిణాయనం ప్రారంభం సూర్యగమనాన్ని తెలుపుతుంది అర్థవంతంగా రూపుదిద్దుకున్న ముఖచిత్రం డింగరి సంపత్‌కుమార్ కుంచె నుంచి జాలు వారింది


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# బద్రీనాథ్ క్షేత్రంలో భక్తిపారవశ్యం వెల్లువెత్తిన వేళ...

బద్రీనాథ్ క్షేత్ర వైభవం అందరికీ అందాలనే శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి ఆంకాంక్షలకు అనుగుణంగా మార్పులు జరుగుతున్నవేళ స్వామి వారి మూర్తిని ప్రతిష్ఠించి చిన్నజీయర్ స్వామి జూన్ ఆఖరు వారంలో ఆవిష్కరించారు. ఈ వైభవంలో ముగ్గురు జీయర్‌స్వాములు పాల్గొన్నారు. అద్భుత ఆవిష్కరణల ఘట్టంలో అద్భుతాలు చోటు చేసుకున్నాయి. వాస్తవానికి 1954లో పదికోట్ల అష్టాక్షరీ మహామంత్ర జపాన్ని అనుష్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పుడు పెద్దజీయర్ స్వామి తలపెట్టిన మహాసకల్ప సాధనకు సుమారు 48 రోజులపాటు సహకరించని వాతావరణంలో కఠోర నిష్ఠతో సుమారు 300 మంది పాల్గొన్నారు. కోటి హవనంతో నిర్వహించిన జపకైంకర్యంలో పాల్గొన్నవారికి అది మధుర జ్ఞాపకం. కేవలం దక్షణాది వారే కాకుండా యావత్ భారతావనిలోని భక్తులందరూ క్షేత్రాన్ని సందర్శించాలని పెద్దజీయర్ స్వామి సంకల్పం, వారి ఆకాంక్ష. నర నారాయణులు తపమాచరించిన చోట, వేదాలు ఉద్భవించిన చోట, భాగవతం వ్యాసుల వారు రచించిన ఈ పుణ్యప్రదేశానికి శ్రీవైష్ణవులు విచ్చేస్తే వారికి వలసిన సౌకర్యాలు అందాలన్నది పెద్దజీయర్ స్వామి వారి ఆకాంక్ష. వారి ఆకాంక్షలకు అనుగుణంగా క్షేత్రంలో సౌకర్యాల కల్పనకు చిన్న జీయర్ స్వామి నేతృత్వంలో జీయర్ ట్రస్టు నడుం బిగించింది. డాక్టర్ శ్రీమాన్ రామేశ్వర్ రావుగారు ఆర్థిక సాయంతో గత దశాబ్దకాలంగా పనులు వేగవంతం అయ్యాయి. ముందుగా భవగత్‌రామానుజుల వారి విగ్రహం ఆవిష్కరణ జరిగింది. నేడు ఆపక్కనే పెద్దజీయర్ స్వామి వారి అర్చామూర్తిని వేంచేపుచేశారు. ఈ సంవత్సరం ఇది మరో అద్భుత ఘట్టం. చారిత్రక ఘట్టం. ముచ్చింతలలో సమతామూర్తిని ఆవిష్కరించుకున్న వేళా విశేషంలో ఈ అద్భుత ఘట్టం మన కనులముందు ఆవిష్కృతమవడం పూర్వజన్మసుకృతం.



పెద్ద జీయర్ స్వామి ఆకాంక్షలకు అనుగుణంగా బద్రీనాథ్‌కు విచ్చేస్తున్న భక్తుల సంఖ్య పెరగడం తద్ అనుగుణంగా సౌకర్యాలను విస్తరించే బాధ్యతకూడా పెరిగింది. నిర్మాణం పనులు చేపట్టారు. బద్రీనారాయణ స్వామికి చందనసేవా సంకల్పం కూడా శ్రీమాన్ రామేశ్వర్ రావు గారి సారథ్యంలో జరిగింది. 1954 నుంచి ప్రతియేటా బద్రీనారాయణ స్వామి సందర్శన సమయంలో మంత్రజపాన్ని అనుష్ఠించే వారు విచ్చేస్తున్నారు. అంతే కాకుండా భాగవత సప్తాహాన్ని నిర్వహించేందుకు భాగవతోత్తములు కూడా విచ్చేస్తున్నారు. గత సంవత్సరం భగవత సప్తాహం నిర్వహించిన వారిలో శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశికగారు కూడా ఉన్నారు. విశేషం ఏమిటంటే ఈ సంవత్సరం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారు, శ్రీశ్రీశ్రీ అహోబిల జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు కూడా విచ్చేసారు. ముగ్గురు జీయర్ స్వాములు, భక్తబృందం కూడా తరలి వెళ్ళింది. ఈ సమయం ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు. మరో వైభవం ఏమిటంటే శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల జీయర్ స్వామివారు స్వయంగా భాగవత సప్తాహం నిర్వహిండం. ఈ వైభవాన్ని కనులారా వీక్షిస్తూ ప్రత్యేక రసానుభూతిలో తన్మయులు అవుతున్నారు. అది వైకుంఠమే! వేంచేసి ఉన్న జీయర్ స్వాములు దివ్యసూరులే!! భక్తి పారవశ్యం వెల్లువెత్తిన వేళ... ఈ సంవత్సరం బద్రీక్షేత్రాన్ని దర్శించినవారిది ఎంతభాగ్యమోకదా!!

# హరిశయనం ఆషాఢ మాస విశేషం

ఆషాఢ మాసం "మేఘాలు మెరిసి కురిసి భూదేవి ఒడిలో ఉపశమిస్తాయి'' అని కవులు వర్ణిస్తారు. దట్టమైన నీలి మేఘాలతో ఆవరించి ఉంటుంది ఆకాశం! ముసురులతో మురిసిపోతుంది భూమి! ఒక్కోసారి ప్రకృతి బీభత్సాన్ని కూడా చూస్తాము. శుభకార్యాలు జరుపుకోక శూన్య మాసమని తెలిపినా తొలి ఏకాదశిగా పండగలు ప్రారంభం అవుతాయి. ప్రధానంగా తెలంగాణలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరుపుతారు. కొత్త కోడళ్ళు అత్తగారి ఇంటి గడప దాటకూడదు అని తల్లిగారింటిలో ఉంటారు. కొత్త అల్లుళ్లకు "ఆషాఢపట్టి'' అని కట్న కానుకలు పెట్టి వేడుకలు జరుపుతారు. యతీంద్రులు,, నిష్ఠాగరిష్టులు ఈ మాసంలో నుండే చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. ఉత్తరాయణం ముగిసి దక్షిణాయనం ప్రారంభం అవుతుంది అంటే సూర్యగమనంలో మార్పు జరిగి దక్షిణ తూర్పులో సూర్యుడు ఉదయిస్తాడు. పితృదేవతలకు ఇష్టమైన కాలంగా దక్షిణాయనాన్ని తెలుపుతారు. వాతావరణ మార్పులు, బురద నీటి ప్రవాహాలు ఇత్యాదుల వల్ల కొంత అనారోగ్యం ప్రబలే అవకాశాలు ఉంటాయి. గ్రామ దేవతల ఆరాధనలు ఈ మాసంలో చేస్తారు. ప్రత్యేకించి ఈ మాసం స్త్రీలు గోరింటాకు నూరి అరచేతులకు అరికాళ్లకు అందంగా పెట్టుకుంటారు. ఎర్రగా పండితే శుభంగా భావిస్తారు. మకర సంక్రాంతితో ఉత్తరాయణం ప్రారంభమైతే కర్కాటక సంక్రమణంతో దక్షిణాయనం ప్రారంభమవుతుంది. ప్రధానంగా ఆషాఢమాస ప్రత్యేక పర్వదినాలను పెద్దలమాటగా తెలుసుకుందాము.




"నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే
సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళం'' అని జగన్నాథుని స్తుతి. ఈ శ్లోకానికి మరొక పాఠాంతరం కూడా ఉంది. "బలభద్ర సుభద్రాభ్యాం'' అని, సుభద్రా బల దేవాయ అని కూడా స్తుతిస్తారు. జగత్ కారణుడైన జగన్నాథుడు అనగా శ్రీకృష్ణుని విభవావతారంలో సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరి ఉంటాడు. సుభద్ర అనగా మంగళప్రదమైనది అని, అక్కడి నీలాచల రాజు యొక్క కుమార్తె సుభద్ర జగన్నాథుని వరించింది కనుక సుభద్రా ప్రాణనాథాయ అని పెద్దలు సమన్వయం చేస్తారు. సుభద్రా బలభద్రాయ అంటే సోదరి యగు సుభద్రాదేవి అని, "భద్ర'' అనగా మాయాదేవిగా ఉద్భవించిన భద్రాదేవి అని కూడా పండితులు అన్వయిస్తారు. ఆషాఢ శుద్ధ విదియ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీ జగన్నాథుని, బలభద్ర, సుభద్రల రథోత్సవం జరుగుతుంది. ఎన్నో దేవ రహస్యాలకు నిలయమైనదీ క్షేత్రం. అందుకే "అగాధం జగన్నాథం'' అని నానుడి.

సర్వ సృష్టి చక్రానికి ప్రతీకలుగా జగన్నాథ రథచక్రాలు కదులు తాయి. లక్షల మంది జనాలు ఈ వేడుకలో పాలుపంచు కుంటారు. ఆషాఢ శుద్ధ పంచమి'' ఆడిపదినెట్టు'' అని తమిళ కర్ణాటక ప్రాంతాల్లో కావేరీ నదికి కొత్త నీటి వరద వస్తుందని పండుగ చేస్తారు. శుద్ధ షష్ఠి స్కంధ వ్రతం ఆచరిస్తారు. సుబ్రహ్మణ్య స్వామిని అర్చించి కుమార షష్ఠి అని ఉపవాస వ్రతం చేస్తారు. సప్తమి ద్వాదశ సప్తమి వ్రతంగా వివత్సప్తమి, మిత్రాఖ్య భాస్కరపూజ అని సూర్య పూజను చేస్తారు. దుర్గాదేవి పూజా విశేషంగా మహిషఘ్ని పూజ చేసి అష్టమి తిథిని ఆచరిస్తారు. దశమినాడు పూరీజగన్నాథ్ లో రథ యాత్రలో బయలుదేరిన స్వామికి పునర్ యాత్ర ఆరాధనం చేస్తారు. మరియు శుద్ధ దశమి నాడు శాకవ్రతం అను మహాలక్ష్మీ వ్రతం ఆచరించి, మాసం రోజులు ఆకు కూరలు తినడం మాని నియమంగా శాక దానాలు చేస్తారు.

ఆషాఢ మాసంలో అత్యంత విశేషమైనది శుద్ధ ఏకాదశి. దీనిని శయన ఏకాదశి, హరిశయనం, దేవశయని అను పేర్లతో వ్యవహరిస్తారు. విష్ణుమూర్తి క్షీర సాగరం లో క్షీరాబ్ధి నాథుడై ఈనాటి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు శయనిస్తాడట! ఈనాటి నుండి చాతుర్మాస పుణ్య దినాలుగా పరిగణిస్తారు అలాగే పండుగలలో తొలి పండుగగా తొలి ఏకాదశి అని మహా ఏకాదశి అని కూడా అంటారు. చాతుర్మాస్య వ్రతం గురించి ఎన్నో విశేషాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్రతం అనుసరించే వారు ఈ నాలుగు నెలలు ఆహారంలో చాలా నియమాలు పాటిస్తారు. ఒకే ప్రదేశంలో నివాసం చేస్తారు. ఆషాఢ పూర్ణిమ వ్యాస జయంతి. దీనిని గురుపూర్ణిమ మహాశాఢ అని కూడా అంటారు. అద్వైతులు వేద వ్యాసుడే **(మిగతా 9 పేజీలో)**

# మన దేవాలయాలు





"నారసింహ వపుః శ్రీమాన్" సర్వ సులభుడు సుందరుడు అయిన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలు మన తెలుగునాట అనేకం అత్యంత వైభవంగా విలసిల్లుతున్నాయి. గుట్టల వంటి ప్రదేశాల్లో వెలసిన నరసింహ ప్రాచీన దేవాలయాల్లో కాకతీయులచే నిర్మించబడిన బెజ్జంకి దేవాలయం ప్రసిద్ధమైనది. కరీంనగర్ కు 35 కిలోమీటర్ల దూరంలో బెజ్జంకి గ్రామంలో మెట్లచే నిర్మింపబడిన చిన్న గుట్ట ప్రాంతం! ప్రాచీన శిల్ప కళలను ప్రతిబింబించే కట్టడం! అందమైన ప్రకృతి దృశ్యాలతో ప్రశాంతమైన పరిసరాలతో ఆధ్యాత్మిక తేజస్సు ఉట్టిపడే ప్రాంతం! ఈ దేవాలయ శిల్పాలపై పురావస్తు శాఖ పరిశోధనలు జరిగాయి. శిల్ప విశేషాలపై ప్రత్యేక పరిశోధన గ్రంథాలు కూడా ముద్రించబడ్డాయి. ఆలయం లోపలి భాగం త్రికూటాలయం గా నలుపు రాతి స్తంభాలతో నిర్మింపబడిన రాతి కట్టడం. గర్భాలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి అర్చా మూర్తులు, స్వయంభువుగా వెలసిన శిలా మూర్తి, ఆల్వార్ సన్నిధి ఉన్నాయి. పాంచరాత్ర ఆగమ విధానంతో ఆరాధనలు జరుపబడతాయి. చైత్రమాసంలో బ్రహ్మోత్సవాలు వైశాఖ చతుర్దశి నరసింహ జయంతి ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తారు. తెలంగాణ ప్రాంతంలో జాతరగా పిలువబడే ఈ బ్రహ్మోత్సవాలకి ప్రతిఏటా రెండు లక్షల మంది భక్తుల వరకు వస్తారు. నిత్యము ఎంతో మంది సుదూర ప్రాంతాల నుండి వచ్చి దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ దేవాలయానికి నిత్య అర్చకులుగా శ్రీమాన్ శేషం మధుసూదనాచార్యులు ఆరాధన విధులు నిర్వహిస్తున్నారు. మరియు ఆలయ అభివృద్ధి కమిటీ కూడా ఉంటుంది. తెలంగాణలో ప్రాచీన ఆలయ వైభవ అభివృద్ధిని పురస్కరించుకొని స్థానికులు భక్తులు మరిన్ని వసతులు నిర్మాణాలు అవసరం అని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు.

కాకతీయుల నిర్మాణ శైలిని ప్రతిబింబించే ఈ దేవాలయం చుట్టూ విశాలమైన రాతి ప్రదేశం ఉంటుంది మరియు పుష్కరిణి. రథ శాల ఇతర దేవతా సన్నిధులు కూడా ఉంటాయి. హైదరాబాద్ హైవే లో కరీంనగర్ నుండి వెళ్ళే దారిలో కుడివైపున ఐదు కిలోమీటర్ల లోపల సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల గ్రామం శివారులో ఈ దేవాలయం ఉంటుంది. బెజ్జ వంక అని ఒక బెజ్జం నుండి నీరు ప్రవహించే ప్రాంతంగా ఆ గ్రామానికి బెజ్జంకి అనే పేరు వచ్చిందని చరిత్ర. 1053 సంవత్సరాల క్రితం నిర్మింపబడిన శనిగరం శాసనంలో ఈ గ్రామ విశేషాలు ఉన్నాయి.

గొప్ప మహత్యం విశ్వాసం కలిగిన ప్రాచీన దేవాలయమైన బెజ్జంకి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తరిద్దాం






**మీరూ**

**భాగస్వాములు కండి!!**

మీ గ్రామంలోని ఆలయం విషయాలను విశేషాలను శ్రీసన్నిధానం పాఠకులతో పంచుకోండి. ఆలయాల వైభవాలను వెల్లడించడానికి చక్కని ఫొటోలు అందిస్తూ మీభావస్ఫూర్తితో వివరాలు మాకు అందజేయండి.

**పంపవలసిన వాట్సాప్ నంబర్**
**9502583323**

# శ్రీరామానుజ సుధామాధురి



## బాల సూర్యుని భావ స్ఫూర్తి

చరిత్రపుటల్లో ప్రస్ఫుటం అయ్యే సత్యాలు మహనీయుల జీవిత చిత్రాలను కళ్లకు కట్టినట్టుగా చూపుతాయి. పెద్దల ప్రమాణ శ్రీ సూక్తులు ఆవృత్తాంతాలను బలపరుస్తాయి. అవి మనకు కర్తవ్యాన్ని బోధించి ప్రభావ పరుస్తాయి.

సమాజాన్ని ఉజ్జీవింప చేయాలనే పూర్వాచార్యుల సంకల్పంతో భగవదాజ్ఞతో అవతరించిన వారు శ్రీ భగవద్ రామానుజా చార్యులు

" పుణ్యాంబోజ వికాసాయ పాప ధ్వాంత క్షయాయచ
శ్రీమాన్ ఆవిరభూత్ భూమౌ రామానుజ దివాకరః" అని పుణ్య మనే పద్మాన్ని వికసింప చేసి పాపమనే చీకటిని తొలగింప చేయు సూర్యుని వలె ఉదయించాడు అని స్తుతిస్తారు. వారు పుట్టగానే వేద పురుషుడు, భూమాత, నమ్మాళ్వారు సంతోషించారట! దివ్య తేజోమూర్తి ,వరప్రసాది అయిన బాల సూర్యుని వంటి కుమారుని చూసి తల్లి దండ్రులైన కేశవ సూరి, కాంతిమతి దేవిలు ఎంతో ఆనందించారు. తండ్రికి పంచాయుధాలుగా తల్లికి ఆదిశేషునిగా ఆబాలుడు దర్శనమిచ్చాడట! మేనమామ అయిన పెరియ తిరుమలనంబి యమునాచార్యుల శిష్యులు తిరుమలలో నిత్య సేవలో ఉండి మేనల్లుడి జన్మ వార్తతో సంతోషంగా పెరంబూదూరు వచ్చారు. శిశువును ఆశీర్వదించి తిరుమణితో పూగుర్తులుగా శంఖచక్ర ముద్రలు వేశారు. లక్ష్మణ పెరుమాళ్ళ అంశగా ఇళయ్ ఆళ్వార్ అని నామకరణం చేశారు. అప్పటి నుండే శ్రీ సిద్ధాంత సౌరభ విస్తరణకు నాంది పడింది. అన్ని సంస్కారాలు జరుపబడి, చిన్నతనం లోనే వివాహం కూడా జరిగింది. తండ్రిగారు పరమపదించిన తర్వాత పెరంబూదూరు వదిలి కాంచీపురానికి చేరుకున్నారు. ఆనాడు ప్రచారంలో గల అద్వైత సిద్ధాంత బోధకుడు యాదవప్రకాశుడు. అతని వద్ద వేదవిద్య అభ్యసించడం ప్రారంభించారు శ్రీ రామానుజులు

ఒకనాడు గురుసేవా సమయంలో చాందోఖ్యోపనిషత్తులోని "తస్య యథా కప్యాసం పుండరీక మేవమక్షిణీ" అను మంత్రార్థం ప్రస్తుతము కాగా, యాదవప్రకాశుడు చెప్పిన అర్థము విని శ్రీరామానుజులు వేదన చెందారట! హిరణ్య పురుషుని నేత్రములు మర్కట పృష్ఠ భాగం వలె ఎఱ్ఱగా ఉన్నాయని గురువు చెప్పిన అర్థాన్ని ఖండించారు. జగత్కారణుడగు హిరణ్య పురుషునికి సూర్యకిరణాలచే వికసించిన కమలము వంటి కన్నులు గలవు అని సమన్వయం చెప్పారు రామానుజులు. అలాగే పరబ్రహ్మ కల్యాణ గుణ లక్షణాల గురించి, చిదచిదీశ్వర తత్త్వాలను గురించి అనేక అంశాలలో వేదార్థాలకు యథార్థ భావస్ఫూర్తిని వెలువరించారు.

ఈ వైఖరి యాదవప్రకాశులకు రుచించలేదు ఎలాగైనా వారిని శిష్యగణం నుండి తొలగించాలని భావించి కాశీ యాత్రలో వారిని అడవిలో వదిలి వేశారు. కానీ పుణ్యదంపతుల రూపంలో వరదరాజ పెరుమాళ్ అనుగ్రహంతో శ్రీరామానుజులు మళ్ళీ తిరిగి కాంచీపురానికి చేరారు. చేసేదిలేక యాదవప్రకాశుడు శ్రీ రామానుజా చార్యులను మరల తన శిష్య గణంలో ఉంచుకున్నారు. ఆ ప్రాంత రాజు యొక్క కుమార్తె పైన గల బ్రహ్మరాక్షసి యాదవప్రకాశుని ధిక్కరించి శ్రీ రామానుజులకు పాదాక్రాంతం కాగా గురువు మరింత క్రోధావిష్టులయినారు. మరొక మంత్రానికి కూడా తన సిద్ధాంత వ్యతిరేకమగు అర్థాన్ని చెప్పగా మండిపడి శ్రీరామానుజులను బహిష్కరించారట! ఆ మంత్రాన్ని పెద్దలు ఈవిధంగా వివరిస్తారు "సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత" అనగా సృష్టి బ్రహ్మము వలన జనించి అందే ఉండి మళ్లీ అందే లయిస్తుంది. అందుచేత విశ్వము బ్రహ్మచేత పరివ్యాప్తం అయి ఉంటుందని నిరూపించి వివరించారట!


శ్రీరామానుజుల కోసం ఎదురుచూసే యామునాచార్యుల శిష్యులు తిరుకచ్చినంబివారు (కాంచీ పూర్ణులు) వారు శ్రీ కంచి వరదరాజ స్వామికి చేసే సేవా కైంకర్యమును, వారి స్వభావమును చూసి శ్రీ రామానుజులు వారితో స్నేహాన్ని పెంచుకున్నారు. వారిని గురు భావంతో గౌరవించారు. యామునాచార్యులు అనారోగ్యంతో ఉండి శ్రీరామానుజులకై పరితపించారు. మహాపూర్ణులను (పెరియ నంబి) రామానుజుల వద్దకు పంపించారు. వారు పఠించిన ఆళవందారుల స్తోత్రరత్నం లోని అద్భుతమైన భావానికి ముగ్ధులైనారు రామానుజాచార్యులు. ఆ శ్లోకము

స్వాభావికానవధికాతిశయేశిత్వం (మిగతా 9 పేజీలో)

# అగణ్య పుణ్యవారాశి... ఆది ఏకాదశి

"ఏకాదశీ వ్రత మిదం వ్రతానాం ప్రవరం స్మృతం" అన్ని వ్రతములలో ఏకాదశి వ్రతము సర్వోత్తమమయినది. అని పై స్మృతి వాక్యానికి అర్థం. కారణం ఇది నిష్కామ వ్రతము. భగవంతుని యొక్క అనుగ్రహాన్ని మాత్రమే కోరుతూ అతని సన్నిధికి చేరి శాశ్వత ఆనందమును పొందాలనుకునే వారంత ఆచరించవలసిన మోక్ష వ్రతమిది.

శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీ కృష్ణమా చార్యులు
**ద్వివేది, యం.ఏ(సంస్కృతం), భద్రాచలం**



ఏకాదశి భగవంతుడైన శ్రీమన్నారాయణుని యొక్క దివ్య దేహము నుండి సముత్పన్నమైన ఒక సాత్విక శక్తి.

ఒకనాడు భగవంతుడు తన సంకల్పానుగుణముగా యోగ నిద్రకు ఉపక్రమించాడు. దేవతలకు భగవంతుని సహాయం లభించని సమయం ఇదేనని అదే అదనుగా ఆసురీ శక్తులు విజృంభించ సాగాయి. దేవతలను పీడించడం మొదలుపెట్టాయి. భగవంతుని యోగనిద్రకు భంగం కలిగించకూడని సమయం కావడంతో అసహాయ భీరువులైన దేవతలంతా దిక్కుతోచని స్థితిలో వైకుంఠానికి పరుగులు తీశారు. ఆ సమయంలో వారి దైన్యాన్ని గమనించిన భగవంతుని దివ్య శరీరమునుండి దేవతా సంరక్షణకై ఒక సత్త్వశక్తి ఆవిర్భవించింది. భగవంతుని యోగానికి అవరోధం లేనివిధంగా ఆసురీ శక్తులపై హుంకరించింది. యోగ మాయకు ప్రతిరూపమై ప్రభవించిన ఆ సత్త్వశక్తి యొక్క ప్రభావంతో ఆసురీ శక్తులు అంతరించిపోయాయి. దేవతలందరూ సంరక్షితులైనారు.

ఆ తరువాత యోగ నిద్ర నుండి మేల్కొనిన భగవంతుడు ఆ సాత్విక శక్తి యొక్క విజయాన్ని తెలుసుకుని ముగ్ధుడయ్యాడు. తాను యోగ నిద్రకు ఉపక్రమించిన నాటి నుండి పదకొండవ దినమున ఆవిర్భవించిన ఆ మూర్తికి ఏకాదశి అని నామకరించాడు.

ఆ ఏకాదశికి తిథిత్వాన్ని కూడ ప్రసాదించాడు. అప్పటివరకు మాసములకు రెండు పక్షములుగా పూర్ణిమ, అమవాస్యలే పక్షాంత దినములుగా పరిగణించబడే విధానంలో 11 వ దినము ఏకాదశిగా భగవత్ప్రయుక్తం కావటంతో నాటినుండి ఏకాదశికి ముందు వెనుకల తిథులన్నీ ఆయా సంఖ్యావాచక నామములతోనే విలసిల్లాయి. ఆ విధముగా మాసమునకు కల ముప్పది రోజులకు సంకేతములు ఏర్పడ్డాయి. ప్రతిపక్షంలోని పదకొండవ దినము ఏకాదశి గానే కీర్తించబడింది. అలా పక్షమునకు రెండు చొప్పున పన్నెండు మాసములలో 24 ఏకాదశులు ఏర్పడ్డాయి. 24 ఏకాదశులుగా గణించబడే ఈ సాత్విక శక్తి ఆవిర్భవించిన

ఆషాఢ శుద్ధ ఏకాదశియే ఆది ఏకాదశిగా అదే తొలి ఏకాదశిగా సంభావించబడుతోంది.

మనలో ఐదు కర్మేంద్రియములు ఐదు జ్ఞానేంద్రియములు వీటిని ఇంద్రియ దశకం అంటారు . ఒక్కొక్క తిథి యొక్క ప్రభావం ఒక్కొక్క ఇంద్రియం పై ఉంటుంది. ఇంద్రియములన్నింటికి రాజు వంటిది మనస్సు దానిని పదకొండవ ఇంద్రియముగా పరిగణించారు మన పూర్వులు. అదేవిధంగా తిథులలో పదకొండవది ఏకాదశి. దానిని తిథులలో నియామక శక్తిగా నిర్ణయించి ఏకాదశి నాడు మనస్సు ప్రభావితం అవుతుంది అని ప్రకటించారు.

అది సాత్వికమైన శక్తి విశేషం కావడంతో ఆ ఏకాదశినాడు పరమసత్త్వమయుడైన శ్రీమహావిష్ణువును ఉపాసించుట, సాత్వికమైన నియమ నిబంధనలతో గడుపుట వంటివి ఈ ఏకాదశి వ్రతం లో నిర్దిష్ట ములయ్యాయి. ఆ విధముగా సత్త్వ ప్రవృత్తిని పెంచే అధికారకత్వాన్నిబట్టి ఏకాదశిని "మన ప్రసాదిని" గా మహర్షులు ఏకాదశిని ప్రకటించారు. అంతేకాదు ఏకాదశికి అయాచితంగా మరో అనుగ్రహం కూడా లభించింది.

ఏనాడైతే తొలిగా ఏకాదశి ఆవిర్భవించిందో ఆనాటి నుండే తాను యోగనిద్రకు ఉపక్రమించి చాతుర్మాస్యాన్ని గడుపుతానని భగవంతుడు వరమిచ్చాడు. ఆ విధంగా భగవంతుడు శయనించే ఏకాదశి కావడంతో శయనైకాదశిగా సుప్రసిద్ధమైంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు మధ్యనున్న కాలమే చాతుర్మాస్య వ్రతకాలముగా స్థిరపడింది. యోగనిద్రకు ఉపక్రమించే తొలి ఏకాదశి శయనైకాదశిగాను నాలుగు నెలల తరువాత మేల్కొనే ఏకాదశి ప్రబోధ ఏకాదశిగాను **(మిగతా 8 పేజీలో)**

## అగణ్య పుణ్యవారాశి... ఆది ఏకాదశి

**(7 పేజీ తరువాయి)** పరిగణించు కుంటున్నాము.

అసలు యోగ నిద్ర అంటే ఏమిటి భగవంతుడి లా చాతుర్మాస్య కాలమలా నిద్రించడానికి కల కారణాలను శ్రీ పారమేశ్వర సంహిత ప్రత్యేకంగా వివరించింది. శాండిల్య మహామునికి బ్రహ్మమానస పుత్రుడైన సనకునికీ జరిగిన సంవాదంలో శాండిల్యుడు చెప్పిన సమాధానం!

కిమ్ దేవ శయనం నామ? కిం దేవః స్వప్సృతీత్యసౌ దేవః

కిమర్థం స్వపితి కిం విధానం తథా వద!

భగవంతుని యొక్క ఆశ్చర్యకరమైన శక్తి సృష్టి స్థితి లయములనే లీలా రూపమైన విచిత్ర శక్తికే మాయ అని పేరు. మమ మాయ అని భగవంతుడు చెప్పినట్లు తనతో నిత్య యోగంతో ఉంటుంది. కాబట్టి ఆ శక్తికే యోగమాయ అని పేరు. భగవంతునికి ఎంతో ప్రీతిపాత్రమైన ఆయోగనిద్ర ఒక వరం కోరింది. మామాంగం మానయస్వ "హే భగవాన్! శ్రీ మహాలక్ష్మిని శంఖ చక్రాది ఆయుధాలను దివ్యా భరణాదులను ధరించినట్లు నన్నుకూడా ధరించు అని యోగనిద్ర ప్రార్థించింది. భగవంతునికి ఆమె ప్రేమకు కనులు ఆనందభాష్పాల గనులయ్యాయి. "తతో దదౌ సు సంతుష్టో నేత్రయోః స్థానమాదరాత్" ఓ మాయా! నిన్ను కనుల లో దాచుకుంటాను. "చతురో వార్షికాన మాసాన్ వాసం వ్రతా గమిష్యసి" అంటూ నాలుగు నెలలపాటు యోగనిద్రను ప్రేమగా కనులలో దాచుకుంటున్నాడు భగవంతుడు. అదే చాతుర్మాస్య చేయడంలోని రహస్యము. అని సనకునితో శాండిల్య ముని యోగనిద్ర యొక్క ఆంతర్యాన్ని తెలియజేశాడు. ఆ నిద్రనే జగద్రక్షణ చింతన అని ఆగమ శాస్త్రాలు బోధించాయి.

ఆ విధంగా భగవంతుడు యోగనిద్రకు ఉపక్రమించే అంటే జగద్రక్షణ చింతన చేసే అగణ్య పుణ్య వారాశి ఈ ఆది ఏకాదశి అదే మన తొలి ఏకాదశి. శ్రీ మహావిష్ణువు యొక్క దివ్య దేహ సంభూత అయిన ఈ ఏకాదశి మాత ఆవిర్భవించిన మహత్తర పుణ్య దినమే తొలి ఏకాదశి! అగణ్య పుణ్య వారాశి గా ఆవిర్భవించిన ఈ ఆది ఏకాదశిని ఆచరిద్దాం! భగవదనుగ్రహం పాత్రులమై తరిద్దాం!

**(సశేషం)**

## జి.యస్. వరదాచారిగారికి శ్రీసన్నిధానం అందించిన వేళ




ప్రముఖ పాత్రికేయులు, శ్రీవైష్ణవపత్రిక వ్యవస్థాపకులు శ్రీమాన్ గోవర్ధన సుందరవరదా చారి గారికి శ్రీసన్నిధాన పత్రిక ప్రతిని మేనేజింగ్ ఎడిటర్ డింగరి శ్రీనివాసమూర్తి అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శ్రీమాన్ జివిఎస్ వరదాచారిగారు 1954లో శ్రీవైష్ణవ పత్రికను ప్రారంభించి దశాబ్దకాలం పత్రికను అందించారు. అది తొలి శ్రీవైష్ణవ పత్రిక. పెద్దజీయర్ స్వామి అంటే వారికి ఎంతో ఇష్టం. శ్రీవైష్ణవం ఆచరించి తన జీవన శైలిలో అనుకరించారు.

## ఆధ్యాత్మిక కవిత

### జయ భక్తి శ్రీమంత!

జననమొందుతు నీవు వినువీధి నెగిరితివి
రవిని ఫలమని తలచి చవులూర మింగితివి
అంజనీ వాయులకు అనుగుపుత్రుడవీవు
వాలిసుగ్రీవులకు మేలు మేనల్లుడవు
సుగ్రీవు మంత్రివై సునిశితంబగు బుద్ధి
శ్రీరామమూర్తితో చెలిమి చేయించితివి
సింధువును లంఘించి సింహళము జేరితివి
శింశుపావనములో సీతమ్మ గాంచితివి
రామ ముద్రికనిచ్చి లంక దహనము జేసి
రయముగా నేతెంచి రామునికి తెలిపితివి
రావణుని చెరనుండి రామ సీతను కావ
రాతి సేతువు గట్టి లంకలో చొచ్చితిరి
నాగాస్త్రమున పడిన నాలక్ష్మణుని లేప
సంజీవి పర్వతము సత్తువను తెచ్చితివి
కుంభకర్ణుని సహా కుటిల రావణుద్రుంచి
సీతమ్మ చేతిగొని శ్రీరామచంద్రుండు
నిజపురికి వెళ్ళుటకు నెయ్యమును నెరిపితివి
జయ వీర! హనుమంత! జయ భక్తి శ్రీమంత!



- డా.అడిగొప్పుల సదయ్య
వ్యవస్థాపక అధ్యక్షుడు
మహతీ సాహితీ కవిసంగమం
కరీంనగరం

# బాల సూర్యుని భావ స్ఫూర్తి

(6 పేజీ తరువాయి)

నారాయణ! త్వయి న మృష్యతి వైదికః కః
బ్రహ్మా శివశ్శతమఖః పరమస్స్వరాడితి
ఏతేపి యస్య మహిమార్ణవ విప్రుషస్తే ॥

దానికి ఆకర్షితులై భక్తితో యామునాచార్యుల వద్దకు వచ్చారు. అప్పటికే పరమపదించిన ఆచార్యుల ముడిచిన మూడు వ్రేళ్ళను మూడు విన్నపాలతో తెరిపించారు. అవి:

1) అహం విష్ణు మతే స్థిత్వా జనానజ్ఞాన మోహితాన్
పంచ సంస్కార సంపన్నాన్ ద్రావిడామ్నాయ పారగాన్

2) సంగృహ్య నిఖిలాన్ అర్థాన్ తత్వ జ్ఞాన పదం శుభం
శ్రీ భాష్యం చ కరిష్యామి జన రక్షణ హేతునా

3) జీవేశ్వరాదీన్ లోకేభ్యః కృపయా యః పరాశరః
సందర్శయన్ తత్స్వభావాన్ తదుపాయ గతీ స్తథా
పురాణ రత్నం సంచక్రే మునివర్యా కృపానిధిః
తస్య నామ్నా మహా ప్రాజ్ఞ వైష్ణవస్య చ కస్యచిత్ అనగా

1) ప్రపత్తి మార్గం, పంచ సంస్కారాలు ద్రవిడ వేద ప్రచారం గావించుట.

2) తత్వజ్ఞాన పరమైన సర్వ హితమైన సకల శుభాలు కలిగించే శ్రీభాష్యాన్ని రచించుట.

3) పురాణ రత్నం విష్ణుపురాణం రచించిన వ్యాస పరాశరుల నామము ఎవరైనా పండితులకు ఇచ్చి ప్రసిద్ధం గావించుట.

అనే మూడు విన్నపాలతో యామున మునులు ముడిచిన వేళ్ళు తెరిచారట! అయినా కూడా ఏదో ఆర్తితో పరితపించి చింతిస్తున్న శ్రీరామానుజుల అభ్యర్థనను తిరుకచ్చినంబిగారు వరదరాజ పెరుమాళ్‌ల ముందు విన్నవించారు! వారు అడిగిన ఆరు ప్రశ్నలకు వరదరాజ పెరుమాళ్ల ఆజ్ఞగా 6 వార్తలు విన్నవించారు. ఈ ఆరు వార్తలు శ్రీ రామానుజాచార్యుల జీవిత పథాన్ని నిర్దేశించాయి.అవి: అహమేవ పరం తత్వం జగత్కారణ కారణం క్షేత్రజ్ఞేశ్వరయోర్భేదః సిద్ధ ఏవ మహామతే
మోక్షోపాయో న్యాస ఏవ జనానాం ముక్తిమిచ్ఛతాం
మద్భక్తానాం జనానాంచ నాంతిమ స్మృతి రిష్యతే
దేహావసానే భక్తానాం దదామి పరమం పదం.
పూర్ణాచార్యం మహాత్మానం సమాశ్రయ గుణాశ్రయం.
ఇతి రామానుజార్యాయ మయోక్తం వద సత్వరం.

అనగా శ్రీ రామానుజాచార్యుల ప్రార్థన మన్నించి వరదరాజ పెరుమాళ్ ఆరు వార్తలను తెలిపిరి అవి:

1) జగత్ కారణమైన బ్రహ్మమును నేను. 2) జీవేశ్వర విభేదము సిద్ధము (జీవుడు పరమాత్మ వేరు). 3) ముముక్షువులకు ప్రపత్తి మోక్ష హేతువు. 4) అంతిమ స్మృతి లేకున్నా మోక్షము కలుగుతుంది. 5) దేహావసానమందు నా భక్తులకు మోక్షము. 6) మహాపూర్ణుని ఆశ్రయించుము. ఈ ఆరు వార్తలను శ్రీరామానుజులకు వెంటనే తెలుపుము అని వరదరాజ పెరుమాళ్ ఆజ్ఞాపించారట! ఈ విధంగా రామానుజ దివాకరుల జ్ఞానం బాల్యంనుంచే ఉదయ సూర్యుని తేజస్సులా దినదిన పరిపక్వతను పొందింది. పూర్వాచార్యుల ఆళ్వారుల శ్రీ సూక్తులతో ప్రవర్ధమానమై ఉభయ వేదాంత భావస్ఫూర్తితో శ్రీ సిద్ధాంత రత్నమై జగత్ ప్రసిద్ధమైనది.

# హరిశయనం ఆషాఢ మాస విశేషం

(4 పేజీ తరువాయి) శంకరాచార్యులు గా అవతరించారని భావిస్తారు. శ్రీ వైష్ణవులు శ్రీ మహావిష్ణువు అవతారంగా వ్యాసభగవానున్ని భావిస్తారు. వ్యాసపూర్ణిమ గురుపూజా మహోత్సవాలు దేశమంతటా నిర్వహిస్తారు. బహుళ పాడ్యమి కోకిలా వ్రతం అనే కామ్య వ్రతాన్ని కొందరు చేస్తారు. ఆషాఢ బహుళ ఏకాదశి కామికైకాదశి అని ఏకాదశి వ్రతాచరణ చేస్తారు. ఆషాఢ అమావాస్య చుక్కల అమావాస్యగా దీపపూజ చేస్తారు కొత్తగా పెళ్లి అయిన వారు ముత్తయిదువలు దీప జ్యోతులు వెలిగించి విధివిధానంగా గౌరీ పూజ చేస్తారు. బ్రాహ్మణులకు,ముత్తయిదువలకు భోజనం పెడతారు. తెలుగు మాసాల ననుసరించి ఈ మాసం అనురాధ నక్షత్రం పూర్వాచార్యులు శ్రీనాథమునుల తిర్నక్షత్రాన్ని జరుపుతారు. చిత్తా నక్షత్రము నందు శ్రీ పెరియాళ్వార్ తిరునక్షత్రాన్ని జరుపుకుంటారు.

గ్రీష్మ తాపం ఉపశమించి చిగురు మొలకలు పెరిగే కాలం. వ్యవసాయదారులు సేద్య కార్యానికి సంసిద్ధమయ్యే ఆషాఢమాసం అందరికీ శుభాలను కలిగిస్తుంది.


## సువర్ణావకాశం


**వెబ్ సైట్ లో ప్రకటన కొరకు వెంటనే సంప్రదించండి.**

7.5 X 5 సెంటీ మీటరు రూ. 350 /- చొప్పున ఫుల్ పేజీ వరకు ప్రకటన ఇవ్వవచ్చు. చివరి పేజీ 7.5 X 5 సెంటీ మీటరు రూ. 650/- చొప్పున పత్రిక లో ఫుల్ కలర్ ప్రింట్ ప్రకటన ఇచ్చిన వెబ్ సైట్ లో 60 రోజులు ప్రకటన వేయబడును. ఒక సంచికలో ప్రకటన అడ్వటైజ్‌మెంట్ ప్రచురించడంతో పాటు మీకు నచ్చిన వారికి 5 పత్రికలు పంపబడును

## - శ్రీ ఉ. వే. శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు -

# శ్రీభాష్యం వారి శ్రీనిధి - ప్రవచనాల పెన్నిధి

శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు శ్రీ వైష్ణవ శ్రీనిధిని ప్రపన్నులకు శ్రీ రామామృత అక్షయ పాత్రతో వితరణ చేసిన పండితా చార్యులు. తిరుప్పావై ప్రబంధ ప్రవచన సుధలు కురిపించి శ్రీ సంప్రదాయ సిరులు పండించిన ప్రవచన శిఖామణులు శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారు. వేనోళ్ళ పొగడినా వారి వాక్ సిరిని వర్ణించనలవి కాదు. శ్రీ భాష్య కాలక్షేపాలు అనుగ్రహించిన పూర్వీకుల పరంపరగా శ్రీ భాష్యం అను ఇంటి పేరుతో సార్థక నామధేయులు.



సిద్ధాంత సాంప్రదాయాలను స్థిరీకరించి ఎన్నో వేదికల ద్వారా సాంప్రదాయ విస్తరణ గావించారు. అతులిత బలధాముడైన హనుమంతుని సుందర తత్వాన్ని దర్శింప చేశారు. సకల సంపదలను ఇచ్చేదిగా శ్రీ తిరుప్పావై వ్రత ప్రాధాన్యాన్ని ఉపదేశించారు. స్త్రీ పురుష భేదం లేకుండా వ్యక్తిగతంగా ఎందరినో శిష్యులనుగా ఆదరించారు. వాత్సల్యంతో వారిని దరికి చేర్చుకొని ఎన్నో ఆధ్యాత్మిక బోధనలు చేశారు. శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారి దగ్గర శిష్యులుగా సాంప్రదాయ పరిపక్వత పొందిన వాళు ఎందరో నేడు ఆ సాంప్రదాయ సేవలో ఉన్నారు. వృత్తిరీత్యా తెలుగు సంస్కృత పండితులుగా శ్రీకాకుళం జిల్లాలో చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. నాడే అభిజ్ఞానశాకుంతలం, మేఘసందేశం వంటి సాహిత్య విషయాలపై ఉపన్యాసాలు అందించేవారట! గొప్ప ప్రవచన నైపుణ్యం గల వారై "పవచనశిరోమణి" అనే బిరుదును పొందారు. ఆధ్యాత్మిక వేదికలపై ప్రసంగాలు చేశారు ఆనాటి శ్రీ వైష్ణవ సాంప్రదాయాన్ని ప్రచార విస్తారం చేసే కృషిలో వీరు భాగస్వాములయ్యారు. శ్రీమాన్ శ్రీ తే కం గోపాల చార్య స్వామి వారు, శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామివారి వంటి సహచర ప్రభావంతో శ్రీసిద్ధాంత ప్రవచనాలు చేయడం ప్రారంభించారు. ప్రధానంగా శ్రీరామాయణం అంటేనే శ్రీభాష్యం వారి పేరు స్ఫురి స్తుంది. ప్రవచన బోధనలే కాకుండా అనేక సాంప్రదాయ గ్రంథాలను వెలయించారు. వర్ధమాన ప్రవచన కారులకు వారు ప్రత్యక్ష పరోక్ష గురువులుగా ఉన్నారు. వారు రచించిన శ్రీ రామాయణ తత్వ గ్రంథాలు తిరుప్పావై మొదలగు గ్రంథాలు ఈనాటికీ ఒక పరిశీలన పుస్తకాలు (రిఫరెన్స్ బుక్స్)గా ఉపకరిస్తున్నాయి. శ్రీవైష్ణవాచార్యులతోనే కాకుండా అనేకమంది పండితులచేత ప్రశంసలందుకున్నారు.

వీరు 1922 ఏప్రిల్ 6 శ్రీరామనవమి పుణ్యదినాన జన్మించారు. విశాఖపట్నం వాస్తవ్యులు. అపారమైన విద్వత్తుతో అనేక పురస్కారాలు పొందారు. డాక్టర్ పిన్నమనేని అండ్ శ్రీమతి సీతాదేవి ఫౌండేషన్ (1990), రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు (1992), అంబికా లిటరరీ అవార్డు (1994), జగద్గురు పీఠ పురస్కారం (1998), గోపాలోపాయనం అవార్డు (1999), తెలుగుతల్లి అవార్డు (2000) మొదలగు పురస్కారాలు పొందారు. ఎన్నో శ్రీ వైష్ణవ సాంప్రదా గ్రంథాలు రచించారు వాటిలో అందుబాటులో గల శ్రీభాష్యం అప్పలాచార్యుల వారి రచనలు. శ్రీ రామాయణం తత్వ దీపిక, సుందరకాండ తత్వ దీపిక, భాగవతం తత్వ దీపిక, తిరుప్పావు తత్వ దీపిక, తిరుప్పావు భావ దీపిక, దాశరథి శతకం తత్వ దీపిక, ముకుందమాల వ్యాఖ్య, విభీషణశరణాగతి ఆదిత్యహృదయంవ్యాఖ్య, ఏడుకొండలు ఏడుకాండలు, రాముడు మానవుడే, శ్రీ వచన భూషణం ఇత్యాది.

గురువులను ప్రకాశింప చేయడం సంప్రదాయం. ఆచార్య పురుషులతో దేహ, సమకాలీన, ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండడం మహాభాగ్యం! ఆ భాగ్యాన్ని అందరికీ పంచటానికి ఇటీవల శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారి శత జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంతో మంది ఆచార్యులు, ఆచార్య పురుషులు, భాగవతోత్తములు పాల్గొన్నారు.

భాగవత అభిమానంతో శ్రీ సన్నిధానం పత్రిక శ్రీ.ఉ.వే శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వారిని స్మరిస్తూ వారి పాదపద్మములకు వందనాలు సమర్పించుకుంటున్నది. ★

# ఉపాసనా శక్తి

## బాలవిజ్ఞానం

మన పూర్వీకులు వారు కష్టపడి ఎన్నో విద్యలు నేర్చుకొని వాటిని సమాజ క్షేమం కోసమే ఉపయోగించారు.అలాంటి ఒక వృత్తాంతం నేటి కథ!

శ్రీ నారాయణ మునులు అని వారి పేరు. శ్రీరంగం అనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో భగవంతునికి సేవ చేస్తూ ఉండేవారు. కఠిన నియమాలతో ఉపాసన చేసేవారు. వేదవిద్యలు సంప్రదాయ విద్యలు అన్నీ నేర్చుకున్నారు. తన గురువు అంటే వారికి చాలా భక్తి. ఆ గురువు వద్ద తనతోపాటు ఉండే శిష్యులు అరయర్లు. వారు కూడా రంగనాథ స్వామికి సేవ చేస్తూ ఉండేవారు. కానీ అనారోగ్యంతో చాలా బాధపడుతుండేవారు. ఒక రోజు వారి గురుపత్ని "నారాయణా! నీవు ఉపాసన శక్తిని ఉపయోగించి అరయర్ల ఆరోగ్యం బాగా చేయు!" అని అడిగింది. అప్పుడు నారాయణ ముని "అమ్మ! ఏ శక్తి అయినా అది భగవంతునిదే కానీ మన కోరికల కొరకు మనం ప్రార్థించడం సంప్రదాయం కాదు కదా!" అన్నారు. వెంటనే గురుపత్ని "అరయర్లు కూడా భగవంతుని సేవ చేస్తున్నారు కనుక దానికి అడ్డుగా ఉన్న అనారోగ్యమును పోగొడితే తప్పులేదు" అని చెప్పింది. గురుపత్ని ఆజ్ఞతో నారాయణ ముని కఠినమైన తపస్సు లాంటి ఉపాసన చేసి శ్రీ సుదర్శన శతకం అనే గొప్ప స్తోత్రాన్ని పాడారు. అరయర్ల ఆరోగ్యం కోసం శ్రీ సుదర్శన స్వామిని ప్రార్థించారు. వారి ఆరోగ్యం బాగా అయింది గురుపత్ని సంతోషించింది.



ఇంకొక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. మైసూర్ దగ్గర మరొక రంగనాథ క్షేత్ర దేవాలయం సుల్తానుల ఆధీనంలో ఉండేది. శ్రీరంగ క్షేత్రానికి ఉండే వైభవం ఆ క్షేత్రానికి లేదని ఒక మంత్రవేత్తను పిలిచి శ్రీరంగ క్షేత్ర కళలను తగ్గించమని పంపించారు. ఆ మంత్ర వేత్త సాధారణ బ్రాహ్మణుని వలె దేవాలయంలో ప్రవేశించి మంత్రాంజనాన్ని కండ్లకు పూసుకొని అదృశ్యమయ్యే వాడు. దేవాలయాల్లో పరివార (చుట్టూ ఉండే) దేవతలకు బలిహరణం అని అన్నాన్ని కుప్ప లాగా పోసి నైవేద్యం పెడతారు. ఆ బలిహరణ అన్నాన్ని తిని మంత్ర ప్రయోగం చేసేవాడు. కొన్ని రోజుల్లో పెరుమాళ్ళ విగ్రహ కళల్లో మార్పులు వస్తున్నాయి. పెద్దలంతా అది చూసి ఆందోళన పడుతున్నారు. ఈ విషయాలు బాగా తెలిసిన నారాయణ మునిని పిలిచి విచారించారు. వారు ఏం జరుగుతున్నది అని కొన్ని కారణాలు ఊహించారు. వెంటనే వంటశాలకు వెళ్లి బలిహరణ వండే సమయంలో అన్నం లో ఆవాల పొడి కలిపారు. ఎప్పటిలాగే మంత్రవేత్త ఆ బలి అన్నాన్ని తిన్నాడు. ఆవాలపొడి ఘాటుకు మంత్రవేత్త కళ్ళల్లో నీళ్ళు కారి ఆ అంజనం (కాటుక) కరిగిపోయింది. అదృశ్య రూపం పోయి అతను అందరికీ కనిపించాడు. అప్పుడు నారాయణ మునులు మెల్లగా మంత్రవేత్తను విచారించి రహస్యం రాబట్టారు. ధనం ఆశకు ఈ విధంగా చేశానని అతను చెప్పాడు. వెంటనే నారాయణులు "పెరుమాళ్ళకు ఎన్నో విలువైన నగలు ఉన్నాయి. అవన్నీ ఎవరికీ తెలియకుండా మీకే ఇస్తాను. మంత్రానికి విరుగుడు చేసి అన్ని కళలను తిరిగి వచ్చేలా చేయమని" ఆశ చూపించారు. ఆ మంత్రవేత్త అలాగే చేశాడు. కానీ ఈ దేవరహస్యం ఎవరికీ తెలియకూడదు అతనికి ధనం రూపంగా నగలు ఇవ్వాలి. అని నారాయణ మునులు చాలా విచారించి, అతనికి నగలు ఇచ్చారు. అయితే ఇలా ధనాశ తో భగవంతుని నిలయానికే అపకారం తలపెట్టే ఇలాంటి వారిని వదిలితే ఇంకా ఎక్కడైనా అదే పని చేయవచ్చునని బాగా విచారించారు. మంత్రవేత్త తో "మీకు ఇచ్చిన నగలు చాలా విలువైనవి కనుక మీ వెంట మీ ఊరి పొలిమేర వరకు మల్లులను కాపలాగా పంపిస్తాను" అని అన్నాడు. మంత్రవేత్త సరే అని బయలుదేరాడు. మల్లులు నారాయణ మునుల ఆజ్ఞతో ఆ దుర్మార్గ మంత్రవేత్త ను అడవిలో మట్టుపెట్టి పెరుమాళ్ళ నగలు తిరిగి తెచ్చి అప్పగించారు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అయితే ఈ పని వలన నారాయణ మునిలో ఉండే ఉపాసన శక్తి క్షీణించింది. ఆయన కొంత చింతించారు. కానీ తాను చేసింది సమాజానికి ఉపకారమే కనుక మళ్లీ భగవంతుని ప్రార్థించారు. ఒక ఆశ్చర్యకరమైన పని చేశారు

ఒక పెద్ద అగ్ని గుండం పేర్చుకున్నారు. దాని పైన వంద త్రాళ్ళతో ఒక ఉట్టిని ఏర్పాటు చేసుకున్నారు. అందులో కూర్చున్నారు భగవంతుణ్ణి స్తుతించి సుదర్శన పెరుమాళ్ళను ఉపాసించటం ప్రారంభించారు. తాను రచించిన సుదర్శన శతక స్తుతిలోనుండి ఒక్కొక్క శ్లోకం చదువుతూ ఒక్కొక్క త్రాడు ఖండించ సాగారు. అందరూ భయంతో ఆశ్చర్యంతో చూస్తున్నారు. వంద శ్లోక స్తుతులతో వంద త్రాళ్ళను తెంపారు. ఆశ్చర్యం! నారాయణ మునులు గాలిలో అలాగే ఉన్నారు. తిరిగి పవన శక్తిని,ఉపాసన బలాన్ని పొందారు. అందుకే అందరి హితాన్ని కాంక్షించి చేసిన పని వలన శుభ ఫలితాలే కలుగుతాయి.

yono SBI | SBI Payments

SRISANNIDHANAM CHARITABLE TRUST

UPI ID: 9502583323@SBI

SCAN & PAY

# అభినందనలు

శ్రీసన్నిధాన ప్రతులు అందుకున్నవారికి అభినందనలు. శ్రీసన్నిధానం సంచికలు కావాలనుకున్నవారికి మేము సంచికలు ముద్రించి ఉచితంగా అందజేయడం జరిగింది. మాలక్ష్యం పాఠకుల అభిప్రాయాలను గౌరవించడమే. సనాతన సంప్రదాయ వెలుగులు దశదిశలా ప్రసరించేలా శ్రీసన్నిధానం చేస్తున్న ప్రయత్నానికి చేయూత నిచ్చిన వారికి కృతజ్ఞతాభినందనలు.

శ్రీసన్నిధానం ట్రస్ట్ ఆవిర్భావం తరువాత సంచిక ముద్రణ కార్యభారం వహించడానికి పోషకులకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది. మీ వెంట మేమున్నాం అన్నవారికి శ్రీసన్నిధానం సంచిక పంపించాము. అందుకున్నవారు తమ స్పందన తెలియజేయండి!

పాఠకుల అభిప్రాయాలమేరకు కార్యాచరణ ఉంటుందనేది సుస్పష్టం. శ్రీసన్నిధాన డాట్ ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో వెబ్‌లో నమోదు చేసుకోవాలి. లేదా నేరుగా ఫోన్ ద్వారా కానీ వాట్సాప్ ద్వారా కానీ సంప్రదించవచ్చు.

**-మేనేజింగ్ ఎడిటర్**

# ఆధ్యాత్మిక వార్తలు



## బదరీ క్షేత్రంలో భాగవతసప్తాహం

బదరీ క్షేత్రంలో పెద్దజీయర్ స్వామి విగ్రహ ఆవిష్కరణ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిలస్వామి భాగవత సప్తాహం నిర్వహించారు. భాగవతం ఆవిర్భవించిన ప్రదేశంలో భాగవత సప్తాహం, ఆవైభవాన్ని వీక్షించిన వారి జన్మ తరిస్తుందన్నదని ప్రతీతి. భాగవత సప్తాహం శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల స్వామి ప్రవచించిన వేళ ఆవైభవం గాంచినవారు ఎందరో. శ్రీమాన్ అమరవాది వెంకట నర్సింహా చార్యులు కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుని తమ వంతు కైంకర్యాన్ని అందజేసారు.



## ప్రయాగ్ రాజ్ యాత్రికులకు ప్రత్యేక వసతి సౌకర్యాలు






ప్రయాగరాజ్ హిందువులకు ప్రధానమగు పవిత్ర ప్రదేశం. గంగాయమునా, సరస్వతీ నదుల త్రివేణీ సంగమం. గంగానదికి ఫర్లాంగ్ దూరంలో నెలకొని ఉన్నది లక్ష్మీ నారాయణమందిరం. నూతనంగా పునరుద్ధరించి సంప్రదాయ పరులకు భక్తులకు అనువైన విధంగా అన్ని వసతులతో ఏర్పాటు చేయ బడింది. ఇక్కడ యాత్రికులకు సౌకర్యవంతంగా రెండు మినీ హాల్లు, నాలుగు గదులు, బసచేయుటకు 15 మంచములు, పరుపులు, చాపలు, వంట నిమిత్తము గ్యాస్ స్టవ్ పాత్రలు స్టీలు కుక్కర్లు, మొదలగునవి అమర్చిపెట్టబడ్డాయి. వచ్చే యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోగలరు. మీరు బయలుదేరేముందు సమాచారం ఇచ్చినచో తగువసతులు సమకూర్చబడతాయి.

మీరు సంప్రదించవలసిన వారి పేర్లు:
**అనంతశయనం**
ఇంచార్జ్ : యామునాచార్యులు

**Sri Lakshmi Narayan Mandir**
12/100, Mori Dharagunj, Near SBI Dharagunj Branch
Adjacent to Shiv Mutt PRAYAGRAJ
U P State, contact 9347046230
Ananthasayanam